# సద్వినియోగం

ముకుందరావు ముప్ఫయి యెనిమిదేళ్ళు ఉద్యోగంచేసి, ఆ రోజే పదవీ విరమణ చేస్తున్నాడు.

ఆ రోజు అతనికి యెంతో ఆనందంగా, ఉల్లాసంగా ఉంది.

ఇన్నేళ్ళు రెక్కలు ముక్కలయ్యేలా కాపోయినా, మెదడు బ్రద్ద లయ్యేలా పన్జేసి, ఎటువంటి మచ్చ లేకుండా, రిటైరవుతున్నందుకే ఆ ఆనందం.

ఆ రోజే తనకి రావాల్సిన ప్రావిడెంటు ఫండూ, రిటైర్మెంటు ఫండూ వాడుకోని సెలవుకి ప్రతిగా ముట్టాల్సిన పైకం, వగైరా.... వగైరా....అంత డబ్బూ ఇచ్చేస్తారని అతనికి తెలుసు.

అందుకే ఆ ఆనందం!

ముకుందరావు మొదటే అనుకున్నాడు, తాను రిటైరయ్యాక వచ్చిన డబ్బుతో ఓ ఇంటిని కొనడం గాని, లేదా ఓ ఇల్లు కట్టించడం గాని చెయ్యాలని; అయితే భాగా ఆలోచించిన మీదట, ఆ ఇల్లు తన ఇద్దరి

కొడుకుల మధ్య ఎటువంటి భేద భావాలు ఉత్పన్నం చేస్తుందోనన్న సందేహం కలిగి, ఆ ఆలోచనకి తిలోదకాలిచ్చాడు.

అంతే! రాబోతున్న డబ్బుని ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసెయ్యాలన్న నిర్ణయాని కొచ్చాడు. అతనికి తెలుసు — ధనమూల మిదం జగత్తని!

ఠంచనుగా పది గంటలకు ఆఫీసు చేరుకున్నాడు, ముకుందరావు. ఇంకా ఒక్కొక్కరూ వస్తూనే ఉన్నారు ఆఫీసు స్టాఫ్.

సీటులో కూర్చున్నాడేగాని, ఏవేవో ఆలోచనలు అతని మెదడులో స్వైర విహారం చేస్తున్నాయి. ఆ సీట్లో తాను కూచోడం, అదే ఆఖరు రోజు .... అన్న ఆలోచన వచ్చేసరికి, అతని హృదయం కించిత్ బాధ పడింది. కాని, అంతలోనే తమాయించుకున్నాడు. ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఓసారి పదవీ విరమణ చెయ్యాల్సిందే కదా!....అనుకున్నాడు.

అధికారులు, సహోద్యోగులు, ఆ రోజు మిట్టమధ్యాహ్నం వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. ముకుందరావుని పలువురు ప్రశంసిస్తూ మాట్లాడారు.

అదే రోజు మధ్యాహ్నం మూడింటికి, ముకుందరావుకి రావల్సిన పైకం అందచేశారు అధికారులు. అటువంటి ఏర్పాటు చేసినందుకు, ప్రభుత్వాన్ని మనసులోనే అభినందించుకున్నాడు, ముకుందరావు.

అతనికి అందిన మొత్తం ఒక లక్షా, రెండువేల రూపాయలు. ఇది అతని ముప్ఫయి ఎనిమిదేళ్ళ శ్రమ ఫలితం!

ఆ డబ్బు ఏం చెయ్యాలో, ముందుగానే నిర్ణయించుకున్నాడు గనుక, అందులో రెండు వేలు మాత్రమే తన దగ్గరుంచుకొని, ఆ రోజే అక్కడి కొచ్చిన బ్యాంకు వారికి లక్ష రూపాయలు అందజేశాడు, ఫిక్సెడ్ డిపాజిట్ రూపంలో. అవసరమైన కాగితాలపై సంతకంపెట్టి, ఆ పైకానికి రసీదు తీసుకున్నాడు. అతని మనస్సు ఎంతో చులకనపడింది. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు ముకుందరావు.

ఆఫీసువాళ్ళిచ్చిన జ్ఞాపికతోపాటు, ముకుందరావు ఇల్లు చేరుకునే సరికి సాయంత్రం నాలుగున్నరయ్యింది.

తన కోసం ఎంతో ఆసక్తితో, భక్తిశ్రద్ధలతో ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యుల్ని ఓసారి కలయజూశాడు.

వాళ్ళంతా ఎంతో నమ్రతతో, తమకంటె వినయ విధేయతలు గల వ్యక్తులు ప్రపంచంలో ఎక్కడా లేరన్నంతగా నుంచున్నారు.

భార్య, శకుంతల చిరునవ్వుతో ఆహ్వానించింది.

ముకుందరావు సోఫాలో కూచున్నాడు. షర్టు గుండీ విప్పుతూ, హాయిగా గాలి పీల్చాడు. "ఫాన్ ఫుల్‌గా పెట్టమంటారా నాన్నా?" అన్నాడు పెద్ద కొడుకు, విశ్వం.

"ఫుల్‌గానే వుంది...." అన్నాడు రెండో కొడుకు రాజు.

"అబ్బ! మీ వాదనలెందుకూ? గాలి బాగానే తగుల్తోంది" అన్నాడు ముకుందరావు కాస్తంత విసుగ్గా.

శకుంతల స్వయంగా లోపలికి వెళ్ళి, కాఫీ తెచ్చి ఇచ్చింది భర్తకి.

ముకుందరావు చిరునవ్వుతో కాఫీ తీసుకున్నాడు.

విశ్వం, తన భార్య విమల వేపు కొర కొర చూశాడు.

"విమలా, కాఫీని అమ్మే తీసుకురావాలా? ఏం, నువ్వెళ్ళి తీసుకొస్తే ఏం పోయిందని?" విసురుగానే అన్నాడు విశ్వం.

"అత్తమ్మ తెస్తోంది కదా అని ఊరుకున్నానండి" అంది విమల.

"పోనీలేరా విశ్వం! ఎవరు తెస్తేనేం? రోజూ మీ అమ్మే కదా ఇస్తోంది కాఫీని...." అని సర్దేస్తూ, అందరికేసి ఓసారి పరికించి చూశాడు.

అందరూ మౌనంగా నిల్చుని, అతనివేపే చూస్తున్నారు. వరాలిచ్చే దేవుడి ముందు నిల్చున్న భక్తుల్లా ఉన్నారు వాళ్ళు.

నవ్వుకున్నాడు ముకుందరావు. వాళ్లు ఎందుకలా తనవేపే దృష్టిని కేంద్రీకరించి ఉన్నారో ఊహించుకున్నాడు. తానిప్పుడు డబ్బున్న మనిషి. తనకి పెద్ద మొత్తంలోనే రిటైర్మెంటు డబ్బు దొరికి ఉంటుందని వాళ్ళకి తెలుసు. వరాలిచ్చినట్టుగా, తమ కోసం డబ్బు వెచ్చిస్తానని వాళ్లు అనుకుంటూ ఉంటారు.... అనుకున్నాడు ముకుందరావు.

అలా ఎంతసేపని మౌనంగా ఊరుకోగలరు? గొంతు కాస్తంత సవరించుకున్నాడు విశ్వం. "మీకు రావల్సిన డబ్బంతా ఇవ్వాళే ఇచ్చేసి ఉంటారనుకుంటా నాన్నా...." అన్నాడునిశ్శబ్దాన్ని ఛేదిస్తూ విశ్వం.

పెద్ద కొడుక్కేసి చూశాడు ముకుందరావు. పళ్ళికిలిస్తూ అగుపించాడు విశ్వం.

"ఔన్రా అబ్బాయ్! నాకు రావల్సిందంతా ఇచ్చేసినట్టే! ఏదో కాస్తంత ఇంక రావల్సి ఉంది. మొత్తం పైకం ఎంతో తెలుసా? ఒక లక్షా రెండు వేలు" అని ముకుందరావు చెబుతూ ఉంటే, అతనిలో ఎన్నడూ లేని మనో నిబ్బరం ఏర్పడినట్టుగా ఉంది.

అక్కడున్న వాళ్ళ మొహాలు తేజోవంతమైనాయ్. అంత డబ్బు మాట వినడమే గాని, ఎప్పుడూ కళ్ళారా చూళ్ళేదు ఎవరూను.

శకుంతల మాత్రం మౌనంగా మనసులో భగవంతుని ధ్యానించుకుంది. భర్త ముప్పయి యెనిమిదేళ్ళు కష్టించి పనిచేసి, రక్తం ధారపోసి సంపాదించిన డబ్బు అది! అదే తమ ఆస్తి....అనుకుంది, ఆనందంతో ఉప్పొంగిపోతూ.

"అబ్బ! అంత మొత్తమే? అయితే మీరిప్పుడు లక్షాధికారి నాన్నా" ఉప్పొంగిపోతూ అన్నాడు రాజు.

"ఔను! నాన్న ఇప్పుడు లక్షాధికారి...." సంతోషం పట్టలేక, తనూ అన్నాడు విశ్వం.

"ఈ డబ్బు ఎలా సద్వినియోగం చెయ్యాలో, మీరే ఆలోచించండి" అంది శకుంతల.

"ఓ చక్కని ఇల్లు కొనేయండి నాన్నా" ప్రతిపాదించాడు విశ్వం.

"రెండు సమాన పోర్షన్లు ఉండే ఇల్లు కొంటేనే బావుంటుంది. లేకపోతే ఎలా?" అన్నాడు రాజు అన్నయ్య ప్రతిపాదనకు తన అభిప్రాయాన్ని జోడిస్తూ.

అప్పుడే పిళ్ళిద్దరిలో స్వార్థం చోటు చేసుకుందని ఊహించాడు, ముకుందరావు.

"రెండు పోర్షన్లు ఉండే ఇల్లు ఒక లక్షకి రాదోయ్ ..." చిన్నగా నవ్వుతూ అన్నాడు. ఒకవేళ అలా వచ్చినా, ఇల్లు కొనడం తనకి ఇష్టం లేదు గాబట్టి, అలా అనేశాడు.

అందరూ ఆలోచనల్లో పడ్డారు. ఒక్కొక్కరి మెదడులో ఒక్కో ఆలోచనుంది.

"ఓ స్కూటరు కొందాం నాన్నా! మనింట్లో ఓ స్కూటరుంటే, ఎన్నో విధాల ఉపయోగపడుతుంది. నువ్వెక్కడికి వెళ్ళాలన్నా నేను

డ్రాప్ చెయ్యొచ్చు. మేం సినీమాలకి వెళ్ళినప్పుడూ ఉపయోగపడుతుంది. దానిమీద నేనూ ఆఫీసుకి వెళ్ళొచ్చు. రిక్షాలకీ, ఆటోలకీ డబ్బులు తగ లెయ్యడం తగ్గుతుంది. ఎలా ఉంది నాన్నా, నా ప్రతిపాదన?" చెప్పాడు విశ్వం.

అతని ప్రతిపాదనకి అందరూ ఓటు వేస్తే కదా, అది నెగ్గినట్టు? రాజు అంగీకరించలేదు.

"స్కూటరుంటే అది నీకే లాభసాటిగా ఉంటుందన్నయ్యా. అది నీ ఉపయోగానికే సరిపోతుంది. మరి, నాకేవిఁటి లాభం? అలా అయితే నాకూ ఓ స్కూటరో, లేక మోపెడో కొనాల్సిందే" అన్నాడు రాజు.

"అలా అనుకుంటే యెట్లా మరిదీ. నీకంటె మీ అన్నయ్య పెద్ద వారు. పెద్దవారికి ఆపాటి సదుపాయాలుండటం తప్పు కాదులే...." అంది పెద్ద కోడలు విమల.

ముకుందరావు విసుగ్గా ఓ నిట్టూర్పు వదిలాడు. "అబ్బబ్బ! వాగ్వి వాదాల్లో పడకండి ..." వారించాడు.

మళ్ళీ నిశ్శబ్దం....

చిన్న కోడలు లక్ష్మి కాస్త తెలివైనది .... యింగితం కలదీను! అంతవరకూ మౌనంగా ఉండి, ఇప్పుడు కలిగించుకుంది. "ఎవరి సదుపా యాలు వారు చూసుకుంటున్నారు గాని, అందరికీ ఉపయోగపడేలా, ఇంటి సామాన్లు కొనుక్కుంటే ఎంత బావుంటుందని?" అంది.

చిన్న కోడలు చెప్పింది సబబుగానే తోచింది, ముకుందరావుకి. శకుంతలకి ప్రతిపాదన నచ్చింది. "నీ అభిప్రాయం ఏమిటో చెప్పమ్మా" అంది శకుంతల.

శకుంతలకి, చిన్న కోడలంటే కాస్త గురి. ఆమె ఏం చెప్పినా, అర్థరహితంగా ఉండదని, ఆమె అభిమతం. "ఓ ఫ్రిజ్జీ, ఓ గ్రైండరు, రెండు గాడ్రేజ్ ఆల్మైరాలు, మంచి సోఫా సెట్టూ, ఓ కలర్ టి. వి.... యివి కొనుక్కుంటే, ఇంటిల్లిపాదికీ ఉపయోగిస్తాయికదా?" అంది లక్ష్మి.

లక్ష్మి ప్రతిపాదన శకుంతలకి నచ్చింది. "నువ్వు చెప్పింది సబబు గానే ఉందమ్మా" అంది శకుంతల. తన అభిమతమూ అదేనన్నట్టు. భర్తకి సూచాయగా తెలియజేస్తూ.

ముకుందరావు మౌనంగా వింటున్నాడు. డబ్బు కనిపించేసరికి మనిషిలో ఎన్ని ఆలోచనలు రేకెత్తుతాయో గమనిస్తున్నాడు.

"కలర్ టి. వి. కొంటే, అది ఎవరి గదిలో ఉంటుంది? విశ్వం ప్రశ్న.

"మన గదిలోనే ఉంటుందండీ" అంది విమల.

లక్ష్మి మొహమాటపడి ఊరుకోలేదు. "కాదు అక్కయ్యా! మావయ్యగారుండే ఈ గదిలోనే ఉంటుంది. రిటైరయ్యారు గాబట్టి టి. వి.తో ఆయనకి ఉబుసుపోతుంది. మనమంతా ఇక్కడికే వచ్చి చూస్తుంటాం" నిర్భయంగా అంది లక్ష్మి.

రాజు భార్య చెప్పిందాన్ని సమర్థించాడు.

కాని విశ్వం, విమల మొహాలు ముడుచుకున్నారు. విమల, తోడికోడలు కేసి రుస రుస లాడుతూ చూసింది. "పెద్ద కొడుక్కి ఈ ఇంట్లో విలువ లేదన్నమాట?" అంది విమల చిరుకోపంతో.

వివాదం తలెత్తుతోందని గ్రహించిన ముకుందరావు, చప్పున కలిగించుకున్నాడు.

"విలువ లేదని ఎవరు చెప్పారమ్మా? ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు. ప్రతిపాదించడమే మీ వంతు. నిర్ణయం తీసుకోవడం, నా కర్తవ్యం. అనవసరంగా మీలో మీరు వివాదాల్ని పెంచుకోకండి" మెల్లగా మందలించాడు పెద్ద కోడల్ని.

మళ్ళీ నిశ్శబ్దం....

అయితే ముకుందరావుకి మాత్రం, చిన్న కోడలు లక్ష్మి చెప్పింది బాగున్నట్టు తోచింది. కాని, అవన్నీ కొనటానికి డబ్బేది? ఆ విషయం వీళ్ళెవరికీ తెలీదు. తను, తనకి దొరికిన డబ్బంతా తీసుకొచ్చినట్టే మాట్లాడుతున్నారు వీళ్ళు... అనుకుని, ముసి ముసి నవ్వుకున్నాడు.

"అయితే మీరే నిర్ణయించండి నాన్నా" అన్నాడు విశ్వం.

"ఔను నాన్నా! నిర్ణయించే బాధ్యత మీకే విడిచిపెట్టాం" అన్నాడు రాజు కూడా.

విమల మొహం జేవురించింది. ఆమె భర్తకేసి రుస రుస లాడుతూ చూసింది. మావయ్యగారి సంగతి ఆమెకి బాగా తెలుసు మరి!

"మావఁయ్యగారి నిర్ణయానికే వదిలేస్తే, ఆయనేవీఁ కొనరు కనీసం, కోడళ్ళకి పట్టు చీరలయినా...." అంది మొహం అదోలా పెట్టి.

ముకుందరావు నవ్వేడు. పెద్ద కోడలు తనపై కినుక వహించి అలా మాట్లాడినా అతనికి కోపం రాలేదు. "వీళ్ళందరికంటె నువ్వే కరెక్టుగా చెప్పావమ్మా! నా మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకున్నది నువ్వే.

నాకు డబ్బు విలువ తెలుసు. డబ్బుకే దాస్యం చేస్తుందీ లోకం. అది నేను స్వానుభవంతో తెలుసుకున్న నిజం. నా చిన్నతనంలో ఆర్థిక లోపంవల్ల ఎన్నో కష్టాల్ని అనుభవించాను. అవమానాలకు గురయ్యాను.

డబ్బు లేనిదే మనిషికి గడ్డిపోచకున్నంత విలువయినా ఉండదని, ఆ రోజుల్లోనే తెలుసుకున్నాను. అందుకనే జాగ్రత్తగా బ్రతుకు నీడ్చుకొచ్చాను. అబ్బాయి లిద్దరినీ చదివించాను. వాళ్లు ప్రయోజకులై, ఉద్యోగాలు చేసుకొంటున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు జరిపించాను.

నా బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించాను. తండ్రిగా, నేను ఏనాడూ నా బాధ్యతల్ని విస్మరించలేదు. బాధ్యతలు తెలిసినవాణ్ణి గనక, ఇన్నేళ్లు నా శ్రమ ఫలితమైన యీ డబ్బు సద్వినియోగం చెయ్యాలని, నా అభిలాష...." అంటూ క్షణం ఆగాడు ముకుందరావు.

"అదే – ఏం చేస్తారూ అని!" కాస్తంత విసుగ్గా అడిగాడు విశ్వం.

"'ఏం చేస్తారూ' కాదురా విశ్వం. 'ఏం చేశారు?' అని అడుగు...." చిన్నగా మందహాసం చేస్తూ అన్నాడు ముకుందరావు.

"అంటే..." అయోమయంగా అడిగాడు విశ్వం. అతని మొహం వాడిపోయింది. అతనికేదో అనుమానం స్ఫురించింది.

"హిందీలో ఒక సామెత ఉంది తెలుసా?"

"ఏవిఁటి నాన్నా?"

"'పైసామే పరమాత్మా హై' అంటుంటారు. దాని అర్థం యేమిటో తెలుసా? డబ్బులోనే పరమాత్ముడున్నాడని! అంటే, డబ్బు అంత ప్రశస్తమైనది, విలువైనదీను! అందుకే డబ్బు లేని వ్యక్తిని హీనాతి హీనంగా చూస్తుందీ లోకం. అంతటి శక్తివంతమైన డబ్బుని యెలా సద్వినియోగం చెయ్యడమా, అని ఆలోచించాను. డబ్బే గనక నా దగ్గరుంటే, అందరూ

నా చుట్టూ తిరుగుతారు .... దాని ఆకర్షణ శక్తి అటువంటిది. మీరొక్కొక్కరూ ప్రతిపాదించినట్టు, ఇల్లు, స్కూటరూ మొదలైన వస్తువులు కొంటే, మీలో స్వార్థం వెర్రితలలు వేసి, మీలో మీకు మనస్పర్థలు వచ్చే అవకాశాలున్నాయి. అందుచేత .." మళ్ళీ ఆగాడు ముకుందరావు. అందర్నీ సస్పెన్సులో పెట్టేస్తూ.

అక్కడున్నవాళ్ళంతా శ్వాస బిగబట్టి చూస్తున్నారు ముకుందరావు కేసి.

శకుంతలకి తెలుసు — భర్త అనాలోచితంగా యేవీఁ చెయ్యరని! అందుకే, ఆమె నిశ్చింతగా ఉంది.

"అందుచేత ..ఏం జేస్తారు?" రెట్టించిన ఉత్సుకతతో అడిగింది విమల.

"భవిష్యత్తు భూతకాల మయ్యిందమ్మా! లక్ష రూపాయలు బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేసేసి వచ్చాను" బాంబు పేల్చినట్టే చెప్పాడు ముకుందరావు.

తెల్లమొహాలు వేశారంతా.

శకుంతల మునిమునిగా నవ్వుకుంది.

భర్త తీసుకున్న నిర్ణయం ఆమె కెంతగానో నచ్చింది.

"ఫిక్సెడ్ డిపాజిట్ చేశారా?" ఆశ్చర్యపోతూ ఓ పక్క ఉక్రోషంగా ఊగిపోతూ అడిగాడు విశ్వం.

"ఔనా!" నిశ్చలంగా అన్నాడు ముకుందరావు.

"అయినా యీ వేళప్పుడేం బ్యాంకు ఉంటుందని?" అనుమానాస్పదంగా అన్నాడు విశ్వం.

ముకుందరావు మెల్లగా నవ్వేడు. "నీకు తెలీదేమో, మాకు పేమెంటు జరుగుతున్న చోటుకే బ్యాంకువాళ్ళొచ్చారు. అంత డబ్బు పట్టుకుని, నేను ఇంటికి రావడం రిస్కు కదా? అందుకే అలా చేశాను."

విశ్వం మొహం వివర్ణమయ్యింది. తండ్రికి పెద్ద మొత్తం డబ్బు వస్తుంది కదా అని, ఎన్నెన్నో ఊహించాడు పాపం!

ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. క్షణం పాటు.

"మీరు చాలా మంచి పని చేశారు మావయ్యా" అంది లక్ష్మి.

విశ్వం, విమల, రాజు ఆమెకేసి ఎర్రగా చూశారు. కాని, ఆమె చలించలేదు.

"ఎందుకలా లక్ష్మివేపు చూస్తారు? నాకు నచ్చిన విధంగా నేను చేశాను. నా భావాలు వేరు. సుమారు నెయ్యి రూపాయల వరకూ బ్యాంకు నుంచి నెలసరి వడ్డీ వస్తుంది. అదే మొత్తం నాకు పెన్షను అందుతుంది. అంటే, నేను ఉద్యోగంలో ఉన్నట్టుగానే సంపాదించుకుంటానన్నమాట! నాకింకేం లోటు చెప్పండి?" అంటూ వాళ్ళకి చెప్తూ భార్యకేసి చిరునవ్వుతో చూశాడు.

శకుంతల, తృప్తిగా నవ్వుకుంది. ఈ రోజుల్లో ఎవరికి ఎవరు? ఎవర్నీ నమ్మలేకపోతున్నాం. డబ్బు బ్యాంకులో ఉంటే, అదే పట్టుకొమ్మ. ఆ ధైర్యమే మనిషిని జీవింపజేస్తుంది, గౌరవం తెస్తుంది. భర్త చేసింది మంచిపనే....అనుకుంది మనసులోనే.

"మీకు కావల్సిన వస్తువులు మీ ఆర్జనతో కొనుక్కోండి. నేను కాదనను. అంతేగాని, నా కష్టార్జితంతో మీ సరదాలు తీర్చుకోడానికి ప్రయత్నించకండి" మళ్ళీ అన్నాడు, ముకుందరావు.

అక్కణ్ణించి ఒక్కొక్కరూ జారుకున్నారు, శకుంతల తప్పించి.

"ఏం శకుంతలా, నేను చేసింది మంచి పనేనా?" భార్య మొహం లోకి చూస్తూ అడిగాడు, ముకుందరావు.

"చాలా మంచి నిర్ణయం తీసుకున్నారండీ! మనం బ్రతికున్నంత కాలం, మనకి గౌరవం ఇప్పించేది యీ డబ్బేనండీ!" అంది, తృప్తిగా.

"ఇదిగో, ఇందులో రెండు వేల రూపాయన్నాయి....నీ దగ్గరుంచు. ఇంక రావల్సిన పైకం కాస్తంత ఉంది. అదీ వస్తే, చిన్నకోడలు చెప్పినవి

తీసుకుందాం. అవి అందరికీ ఉపయోగపడేవి. చూశావా, డబ్బు యెన్ని ఆశల్ని పెంచుతుందో, యెన్ని సమస్యల్ని తెచ్చిపెడుతుందో? అందుకే, 'ధనమూలమిదం జగత్' అంటారు" నవ్వుకుంటూ అని, తాను తెచ్చిన బాగ్‌ని భార్య చేతికి అందించాడు, ముకుందరావు. "అందులోనే ఫిక్స్‌డ్ డిపాజిట్ కాగితాలున్నాయి. . జాగ్రత్త!"

శకుంతల చిన్నగా నవ్వుతూ, లోపలికి వెళ్ళిపోయింది.

నిశ్చింతగా సోఫాలో వెనక్కి చేరబడ్డాడు, ముకుందరావు, తన డబ్బుని సద్వినియోగం చేసుకున్నందుకు.

* స్వాతి, మాసపత్రిక, ఏప్రిల్, 1990 *